# లావణ్య(ం)

-జొన్నకూటి మార్టిన్ ఫిన్‌లె

''చూడమ్మా! రేపటినుంచి పనిమనిషికి రానవసరం లేదని చెప్పు. ఇక మీదట లావణ్య అన్నీ తనే చేసుకుంటుంది.''

''అది కాదురా...పనంతా...'' ఏదో చెప్పబోతున్న తల్లిని వారిస్తూ-

''నేను చెప్పినట్లు వినమ్మా. ఇంకేం మాట్లాడవద్దు. అలా అని నువ్వూ ఏమీ చేయనవసరంలేదు. నీ ఆరోగ్యం కూడా అంతంత మాత్రం. పనంతా లావణ్యతను ఒక్కత్తే చూసుకుంటుంది'' అంటూ మరో మాటకు అవకాశం లేకుండా బయటకి వెళ్లిపోయాడు హరి.

ఎంత గుసగుసగా మాట్లాడిన మాటలు కూడా వంటింట్లోని లావణ్య చెవిన పడ్డాయి. భర్త మాటలకు ఆమె మ్రాన్పడింది. ఇంట్లోనూ, స్నేహితులూ తనని ఎంత చిన్నగా మాట్లాడినా స్పష్టంగా వినగలదని, పాము చెవులని అనేవారు. ఆ కితాబుకి మురిసిపోయేది. ఇప్పుడీ మాటలు చెవిన పడ్డాక అలాంటి ఒక సామర్ధ్యం తనకు లేకుండా వుండి వుంటే ఎంత బావుండేదో అని వాపోయింది.

అందరిలానే ఎన్నో ఆశలతో అత్తవారింట్లోకి అడుగుపెట్టిన ఐదవరోజునే వినిపించిన మాటలు లావణ్యను కలచివేసాయి. మెట్టినింట్లో కోడలిగా, భార్యగా వచ్చిన ఆమెకు ఇప్పుడు భర్త మాటల్లో ఆ ఇంట్లోని తన స్థానమేమిటో స్పష్టంగా ధ్వనించింది. కళ్లల్లోకి నీళ్ళు తోసుకువచ్చాయి. తనని వాళ్లల్లో ఓ మనిషిగా కాక 'పనిమనిషి' స్థాయికి దిగదోయడం ఆమె భరించలేకపోతోంది.

భారీ మొత్తం మూల్యంగా చెల్లించి తల్లిదండ్రులు తనకు వివాహం చేసి అత్తవారింటికి పంపింది, ఇక్కడ భర్తకూ, అత్తగారికీ సేవకురాల్లా సేవలందించడానికా అన్నది ప్రశ్నయింది ఇప్పుడామెకు!

'బాధ'లో రోజంతా ఎలా గడిచిందో?

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన భర్తకు కాఫీ అందించింది. ఎప్పటిలా మామూలుగా అతడు పలకరించబోతే ముభావంగా ఉండిపోయింది. తనపట్ల భర్త మనసులోని ఉద్దేశ్యం తెలిసివచ్చిన తర్వాత నవ్వుతూ ఎలా నటించగలదు?

ఆ రాత్రి పడకమీద లావణ్య భర్తకు సహకరించలేదు.

మరుసటిరోజు ఉదయమే ఆమె కార్యక్రమం ప్రారంభమయింది. ఉదయమే పన్లోకి వస్తూ పని మనిషి తనే పాలపేకెట్ తెచ్చేది. ఈరోజు మొదలు ఆ బాధ్యత కూడా తనదే. ఐదు నిముషాల దూరం నడిచి వెళ్లి పాలపేకెట్ తెచ్చేసరికి ఉదయంపూట నడకతో కొద్దిగా ఆయాసంగా అనిపించింది. అలాగే మొహం కడుక్కుని పాలు కాచి కాఫీ ఫిల్టర్ వేసి భర్తకీ, అత్తగారికీ బెడ్‌కాఫీ అందించి తనూ కాస్త గొంతులో వంపుకుంది.

తర్వాత రాత్రి తాలూకు ఎంగిలి గిన్నెలు ముందేసుకుంది. ఇంతకు ముందెన్నడూ అలవాటులేనిది. ఆ అవసరం రాలేదు. ఇంట్లో తల్లీ, చెల్లెలూ వాళ్ళే చేసుకునేవారు. కూర్చుని తోమటం వల్ల కాళ్లు తిమ్మిర్లెక్కి ఇబ్బందిగా అనిపించింది. ఐనా తప్పదు.

ఎలాగో అయిందనిపించింది. టిఫిన్ కార్యక్రమంలో పడింది. ఆలోగా లేచిన భర్త-

''లావణ్యా! స్నానానికి కాస్త వేణ్ణీల్లు పెట్టు'' ఆదేశించాడు బ్రష్‌తో బాత్రూంకి వెళుతూ.

చేస్తున్న పనాపి స్టవ్‌మీదకి నీళ్లెక్కించి తిరిగి అట్లు పోయడంలో మునిగిపోయింది. మొహం కడుక్కువచ్చిన భర్తకి వేడివేడిగా దోసెలు అందించి ఆపై కాఫీ ఇచ్చింది. టిఫిన్ ముగించి ''కాస్త వేణ్ణీళ్ళు బాత్రూమ్‌లో పెట్టేద్దూ'' లేచాడు భర్త.

అతడికి నీళ్ళు తోడి ఇవతలికి రాబోతుంటే ''లావణ్యా! కొద్దిగా టవల్ ఇటు అందుకో'' అంటూ మళ్లీ ఆదేశం.

''బాత్రూమ్‌కి వెళ్ళేటప్పుడు టవల్‌తోనే వెళ్లొచ్చుకదా. దానిక్కూడా భార్యే అమర్చిపెట్టాలన్నట్టుగా ఆదేశాలు జారీ చేస్తుంటే ఆమెకు కోపం ముంచుకొచ్చింది. ఐనప్పటికీ ప్రదర్శించే వీలు లేక, సమయమూలేక మౌనంగా తనలోనే దిగమింగుకుంది.

మామూలుగా అయితే భర్తలా ప్రతిదానికీ తననే పిలుస్తూ తనపై ఆధారపడుతుంటే సరదాగానే అనిపించేదేమో! నిన్న భర్త మాటల్లో వ్యక్తమయిన భావం...ఈరోజు తన స్థితికి దర్పణం పడుతుంటే భరించడం కష్టంగా వుంది.

భర్త ఆఫీసుకి వెళ్ళేసరికి కొద్దిగా ఊపిరిని తీసుకోవడానికి వీలయింది. అది కూడా తాత్కాలికమే. బియ్యమూ, పప్పు కడిగి స్టవ్ మీద వేసి తర్వాత తడిగుడ్డతో ఇల్లు మాపు తీసింది. ఆపై భర్తవీ, అత్తగారివీ, తనవీ, మాసిన గుడ్డలు నానబెట్టి వుతికింది. అంతా అయ్యేసరికి ఒకటి.

భర్త వచ్చాడు. అతడికి వడ్డించింది. అత్తగారు కూడా తిన్నమీదట తనూ భోజనం చేసింది. భర్త వెళ్లిపోయిన తరువాత కాసేపు నడుం వాలుద్దాం అనుకుంటుండగా ''బియ్యం కడిగి ఎండబెట్టమ్మా. ఆనక తిరగలి విసిరితే సాయంత్రం ఉప్మాకి పనికొస్తుంది'' అంది అత్తగారు. ఆమెకి బొంబాయి రవ్వకంటే బియ్యం పట్టిన రవ్వే ఇష్టం.

కడిగిన బియ్యం ఎండబోసి కాకులు రాకుండా కర్ర పట్టుకుని కూర్చుంది. గంట తర్వాత తిరగలి పట్టి రవ్వ చేసింది. ఆసరికి నాలుగయింది. ఐదింటికి ఠంచనుగా భర్త వచ్చేస్తాడు. ఈలోగా టిఫిన్ రెడీ కావాలి. వంటింట్లోకి నడిచింది.

సాయంత్రం భర్త వచ్చిన తరువాత ఉప్మాతో కాఫీ కూడా అందించి మౌనంగా వంటింట్లోకి వెళ్లిపోయింది మాటామంతీ లేకుండా.

భార్య వరుసచూసి నవ్వుకున్నాడు హరి. ఆమె మొహంలోని పని భారం, అలసట చూసి సంతృప్తిగా ఫీలయ్యాడు.

లావణ్య సాయంత్రం వంట కార్యక్రమంలో పడింది. పూర్తయ్యేసరికి ఎనిమిది. భర్తకూ, అత్తగారికీ, వడ్డించి తనూ తిని లేచేసరికి తొమ్మిది. ఎంగిలి గిన్నెలు బాత్రూమ్‌లో చేర్చి స్నానం కానిచ్చి వచ్చేసరికి తొమ్మిదిన్నర. తీరిక చిక్కని పనితో వళ్లంతా హూనం అయి బాగా బడలికగా అనిపించింది.

గదిలోకొచ్చేసరికి భర్త తనకోసమే ఎదురు చూస్తూ కనిపించాడు. అతడెందుకు ఎదురు చూస్తున్నాడో తెలిసి ఆమెకి చిరాకుగా అనిపించింది. వచ్చి మంచం మీద మరి ఓపిక లేనట్టుగా పడి అటువేపుకి తిరిగి పడుకుంది.

హరి ఆమెమీద చేయివేసి దగ్గరకు తీసుకోబోయాడు.

''ప్లీజ్! అలసటగా వుంది. నన్ను వదిలెయ్యండి'' అంటూ మృదువుగా తిరస్కరించి ''ఇట్స్ నోబుల్ రివెంజ్'' అనుకుంది మనసులో కసిగా.

అతడు మరి బలవంతం చేయలేదు. తను 'అది' లేకుండా కష్టంగానైనా వుండగలడు. కానీ ఆమె మటుకు కష్టపడాల్సిందే అనుకున్నాడు అంతే కసిగా.

కానీ అది ఆ ఒక్కరోజులోనే ఆగలేదు. ఆతర్వాతి రోజూ అంతే అయింది. ఆ తర్వాతి రోజు కూడా సహాయ నిరాకరణోద్యమం కొనసాగుతూనే వుంది. అతడు ప్రయత్నించీ భంగపడుతున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న పనిభారం, అలసట, చికాకుల నేపథ్యంలో ఆమె తన సహాయ నిరాకరణోద్యమం విరమించుకుంది లేదు. మరీ తనక్కూడా బాగా'కావాలి' అనిపించినప్పుడు మాత్రం కొద్దిగా 'రిలాక్సేషన్' ఇస్తుంది. అదీ ఏ పది, పదిహేనురోజులకో ఒక్కసారి. 'ఆ' విషయంలో కూడా భర్త తనని పనిమనిషిని చేయనందుకు కొంతలో కొంత ఊరట. అప్పుడప్పుడు భర్తని బాధించడంలేదుకదా అనిపిస్తుంది. కానీ అంతలోనే అతడు తన మనసుకి చేసిన గాయం కంటే ఈ బాధ అంత లెక్కల్లోనిది కాదని సరిపెట్టుకుంటుంది.

రెండు నెలలు గడిచాయి.

లావణ్యాను చూసేందుకు తల్లీదండ్రీ చెల్లెలూ వచ్చారు.

''ఏమ్మా! మీ ఆయన తిండి పెట్టడం లేదేం? ఎంత పుష్టిగా వుండేదానివి. ఎలాచిక్కిపోయావే తల్లీ'' అంటూ కూతుర్ని చూస్తూనే కళ్లనీళ్ళు పెట్టుకుంది లావణ్య తల్లి.

ఆమాత్రం ఓదార్పు దొరికేసరికి తల్లిని వాటేసుకుని అన్నిరోజులూ భరిస్తూ వస్తున్న బాధని, భర్త ప్రవర్తనని చెప్పుకుని ఏడ్చేసింది. తన కూతురు పడుతున్న కష్టం విని ఆ తల్లి తల్లడిల్లిపోయింది. వాళ్లిద్దరినీ అలా చూసి తండ్రి మాత్రం ఎందుకో నవ్వి ఊరుకున్నాడు.

''అక్కా! అమ్మ అలాగే అంటుందిగానీ అసలు నువ్విప్పుడు ఎంత స్లిమ్‌గా తయారయ్యావో? ముద్దొస్తున్నావనుకో. వెయిట్ రిడక్షన్ ట్రీట్‌మెంట్ ఏదైనా ప్రాక్టీస్ చేశావా?'' అంటూ చెల్లెలు విసిరిన కాంప్లిమెంట్‌కి ఎప్పుడూ అద్దంలో అద్దానికి సరిపోని సైజుని వుడికించే చెల్లెలేనా ఇలా అంటోందని తననోసారి పైనుంచి కిందకి చూసుకుంటూ అద్దం ముందుకు వచ్చింది. పని వత్తిడితో, ఒకలాంటి నిర్లిప్తతతో అద్దానికీ, అలంకరణకు దూరంగా వున్న లావణ్యకు



అద్దంలో తనని తాను చూసుకున్న మీదట చెల్లెలి కాంప్లిమెంట్‌లో అతిశయోక్తేమీ ధ్వనించ లేదు. ఎంత స్లిమ్‌గా అయ్యాను అంటూ తనలో తానే మురిసిపోయింది. తన లావు శారీరక సహజమైనదనీ, ఇంతకాలం పుట్టింట్లో ఏ మాత్రం కష్టపడకుండా సుకుమారిగా పెరగడం వల్ల తను లావయ్యానని ఇప్పుడు తెలుసుకుంది. తనను పనిమనిషిని చేసి భర్త పరోక్షంగా తనని బాధించినప్పటికీ దానివల్ల చేకూరిన ప్రయోజనం చూసి మనసులోనే భర్తకు థాంక్స్ చెప్పుకుంది.

అల్లుడు కేంప్‌కి వెళ్లి ఉండడంతో కూతుర్ని మాత్రమే చూసుకుని బయలుదేరిపోయారు లావణ్య తల్లిదండ్రులు.

వాళ్ళు వెళ్లిన తరువాత భర్తకోసం తెచ్చిన కొత్త బట్టలు బీరువాలో వుంచుదామని బీరువా తెరిచి లోపల పెట్టబోతుంటే ఓ మూల డైరీ కనిపించింది.

కొత్తది! 'భర్తకి డైరీ వ్రాసే అలవాటుందా?' అని ఆశ్చర్యపడుతూ తన గురించి ఏదైనా వ్రాసి వుంటాడా?' అని ఉత్సుకతతో డైరీని చేతుల్లోకి తీసుకుంది.

• • •

హరి కేంప్‌నుంచి వచ్చేశాడు.

ఎప్పటిలాగే ఆ రోజు పనులన్నీ ముగించుకుని తొమ్మిదిన్నరవుతుండగా లోనికొచ్చింది లావణ్య. ఈ రోజు ఆమె మొహంలో ఎప్పటిలా అలసట కాక, కొత్త హుషారేదో కొట్టొచ్చినట్టు కనిపించింది హరికి.

దానికితోడు తెల్లచీర, మల్లెపూలు!

'ఛాన్స్' తీసుకొమ్మని అన్యాపదేశంగా చెప్పేందుకే ఆమె తెల్లచీర, మల్లెపూలతో ముస్తాబవుతోంది. ఏ పది, పదిహేను రోజులకో అరుదుగా వ(ఇ)చ్చే అవకాశం ఈసారి ఇంత తొందరగా లభించిందేమిటా అని ఆశ్చర్యపడుతూ ''ఇవ్వాళ ఈ అభాగ్యుడిపై దయ కలిగిందన్నమాట'' అన్నాడు కొంటెగా నవ్వుతూ.

''ఇవ్వాళ మాత్రమేకాదు, ఇకనుంచి ప్రతి రోజూ'' అంది తల దించుకుని.

''ప్రతిరోజూ...యాహూ...నిజమే'' సందేహంగా అడిగాడు హరి ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

''ఔనండీ. ఇకనుంచి పస్తులతో పనిలేదు. మస్తుమస్తుగా మజా చేసుకోవచ్చు. నాపై మీకు సర్వాధికారాలు వున్నాయి. కేవలం ఓ భర్తగా కాదు, నా మనసుకు నచ్చిన నా భర్తగా'' అంది. అతని గుండెలమీద వాలిపోతూ.

అయోమయంగా చూసాడు హరి భార్యకేసి ఆమెలో ఈ ఆకస్మాత్తు మార్పుకి మూలమేమిటో తెలీక!

''మీ డైరీ చదివాను'' అంది లావణ్య అది గమనించి.

''వ్వాట్?'' అరిచాడు హరి.

''ఔను'' నవ్వుతూ భర్తకేసి చూసి ''నా గురించి మీ మనసులోని అభిప్రాయాన్ని మీ మాటల్లోనే చదివాను. ఇంత కాలంగా నన్ను వేధిస్తున్న బాధకు ఆవిధంగా సమాధానం దొరికింది'' అంది.

''దేనికి చదివావ్?'' హరి చిన్నబుచ్చుకున్నాడు.

''చదివితే మాత్రం ఏం? మీరు కోరుకున్న రిజల్ట్ వచ్చేసిందికదా!''

''ఏమీకాదు. రిజల్ట్ చూసి నేనే చెబుదామనుకుంటున్నాను. నువ్వే ఈలోగా చదివేవావన్న మాట. పోనీ...'' అన్నాడు హరి.


''లావణ్య పేరుకు తగినదే. కానీ లావొక్కింతయు అన్నట్లు కొంచెం లావుగా అనిపిస్తోంది. తగినంత వ్యాయామం వుంటే తగ్గుతుందనే నా నమ్మకం. పనిమనిషికి రావద్దని చెప్పేశాను. అమ్మకి కూడా ఏమాత్రం సహాయం చేయవద్దని చెప్పాను. ఇంట్లో పని చేస్తూ చేసే ఎక్సర్‌సైజు, వెయిట్ రిడక్షన్ ట్రీట్‌మెంట్‌కి ఏ విధంగానూ తీసిపోదు. నా అంచనా రైటే అయితే ఒకటి రెండు నెలల్లోనే లావణ్య మెరుపుతీగ అవుతుంది'' డైరీలో తను వ్రాసిన నాలుగు వాక్యాలూ హరి స్మృతిపథంలో మెదిలాయి.

''మీ మనసులోని ఉద్దేశ్యం తెలీక మీపట్ల కఠినంగా ప్రవర్తించాను. పనిమనిషిని చేసారని కినుక వహించి కొత్తగా పెళ్ళయివుండీ, పెళ్లయిన కొత్తల్లో వుండే ముద్దు మురిపాలకు మిమ్మల్ని దూరం చేసాను. ఎక్సర్‌సైజు ప్రాముఖ్యం నాకు తెల్సి వచ్చింది. అలాగే ఇంత కాలం సెక్సర్‌సైజ్‌కి దూరం చేసినందుకు ఇప్పుడు అపరాధ రుసుంతోసహా మీ కోరిక తీర్చుకోండి'' అంటూ భర్త కాగిట్లో ఒదిగిపోయింది లావణ్య.


''అలా లైసెన్స్ ఇస్తే ఈ లావణ్యం అంతా నాదిగా చేసుకోనా'' అంటూ లైటు తీసేసాడు హరి.

★

## ఇష్టాలు



ట్వింకిల్‌ఖన్నాకి ఏమేమి ఇష్టమో



తెలుసా?

★ సమ్మర్‌లో తెల్లని చుడీదార్, శారీస్, నైట్-నైటీస్ వేసుకుని తిరగడం ఇష్టంట.

★ ఎయిర్ కండిషన్ రూమ్‌లో హాయిగా వాటర్ బెడ్‌పై పడుకొని ఇంగ్లీష్ నవల్ చదువుకోవడం భలే ఇష్టం.

★ సన్నని వానజల్లుపడే వేళ ఎత్తయిన బిల్డింగ్‌పై ఎక్కి, టెర్రస్‌పై నుండి చూడ్డమన్నా చాలా ఇష్టం.

ఆల్‌రైట్ మేడమ్. ఏ కష్టాల్లేకుండా మీ ఇష్టాలన్నీ తీరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

## నీలమ్ ఏమైంది?

బి.పి.యల్. ఓయా, ఎమ్.టి.వి.లో యాంకర్‌గా చేసే నీలమ్ సడన్‌గా ఏమైపోయిందో అర్థంకాలేదు మనకు. కానీ ఆమధ్య కుచ్ కుచ్ హోతాహై, హమ్‌సాత్‌సాత్‌హై లోనూ చిన్న పాత్రల్లో కనిపించింది. ఇప్పుడు హాట్ హాట్ న్యూస్ ఏంటంటే నీలమ్ ఓ పెద్ద బిజినెస్ మాగ్నెట్ అభయ్‌సోనీతో లవ్‌లో పడిపోయిందిట. అందుకే ఎక్కడా కనిపించడంలేదని తేలింది. హు! లవ్‌లో పడితే అంతేమరి.

- విరాజి

